dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ సపుంటి: 01 సంచిక: 38 సోమవారం 27 సెప్టెంబర్ 2026

## కరీంనగర్ సిటీ సమాచారం







## అక్టోబర్ 1న పెద్దపల్లిలో భారీ జాబ్ డ్రైవ్

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**అక్టోబర్ 1న పెద్దపల్లిలో భారీ జాబ్ డ్రైవ్**

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి**

పెద్దపల్లి డీసీ

జిల్లా ఉపాధి శాఖ, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) రీజినల్ సెంటర్ సహకారంతో అక్టోబర్ 1న గురువారం పెద్దపల్లిలో భారీ జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం తెలిపారు. స్థానిక బస్సు డిపో సమీపంలోని టాస్క్ సెంటర్ ప్రాంగణంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువతీ, యువకులు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. ఈ జాబ్ డ్రైవ్‌లో పలు ప్రముఖ కంపెనీలకు చెందిన ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని, ఎల్ఎన్ గ్రూప్ కంపెనీ నుండి అసెంబ్లీ ఆపరేటర్లు, రేడియంట్ కంపెనీ నుండి రిలేషన్‌షిప్ మేనేజర్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ నుండి బ్యాంకింగ్ అసోసియేట్, డి-మార్ట్ సంస్థ నుండి క్యాషియర్, ప్రమోటర్స్ నీమ్యాన్స్ సంస్థ నుండి సేల్స్ ప్రమోటర్స్, వీటితో పాటు డేటా అనలిస్ట్ కోర్సులో ఉచిత ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ కూడా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఈ ఉద్యోగాలకు పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు కనీస వేతనం రూ.18 వేల నుండి రూ.45 వేల వరకు ఉంటుందని, నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు నూతన రెజ్యూమ్, తగిన గుర్తింపు పత్రాలతో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

**తెలంగాణ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆయన పోరాటం స్ఫూర్తిదాయకం..**

**మేయర్ కొలగాని శ్రీనివాస్**

**అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి**

**కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి**

కరీంనగర్ డీసీ

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం, పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆదివారం కరీంనగర్ బైపాస్ చౌరస్తాలోని ఆ మహనీయుడి విగ్రహానికి మేయర్ కొలగాని శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, కార్పొరేటర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, పద్మశాలి సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

తెలంగాణ ఆత్మగౌరవం, బడుగు బలహీన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. పదవులు, అధికారాల కంటే ప్రజల హక్కులకే ప్రాధాన్యమిస్తూ జీవితాంతం ప్రజాసేవకు అంకితమైన మహనీయుడిగా ఆయన సేవలను మేయర్ అడిషనల్ కలెక్టర్ కొనియాడారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ నిస్వార్థ ప్రజాసేవ, విలువలతో కూడిన రాజకీయ జీవితం, అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన చారిత్రక పాత్ర, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం సాగించిన పోరాటం, సామాజిక సమానత్వం కోసం చేసిన కృషిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం ఎప్పటికీ మరువలేనిదని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు, సామాజిక న్యాయం అందేలా కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్, బీసీ సంక్షేమ శాఖ ఎం. అనిల్ ప్రకాష్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య, వేముల కవిత చంద్రశేఖర్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, జిల్లా గౌరవ అధ్యక్షుడు వాసాల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వొల్లాల కృష్ణహరి, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గుడిమళ్ల శ్రీనివాస్, పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి పోరండ్ల రమేష్, ప్రధాన కార్యదర్శి అల్స భద్రయ్య, మాజీ సుడా డైరెక్టర్ వంగర రవీందర్, యువజన సంఘం ఉపాధ్యక్షుడు మెతుకు కృష్ణ చైతన్య, జిల్లా ఉపాధ్యక్షుడు స్వర్గం నర్సయ్య, ప్రచార కార్యదర్శి మార్క ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కదంతొక్కిన 5,500 మంది.. నగర వీధుల్లో మారథాన్ సందడి

**'రన్ ఫర్ హెల్త్.. సే నో టు డ్రగ్స్' నినాదంతో ఆరోగ్య సందేశం**

కరీంనగర్ డీసీ

తెల్లవారుజామునే కరీంనగర్ పరుగుల సంద్రంగా మారింది. ఆరోగ్యం కోసం పరుగెత్తుదాం.. మాదకద్రవ్యాలకు దూరంగా ఉందాం అంటూ వేలాది మంది ఒకే బాట పట్టారు. చిన్నారులు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడంతో నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ ఎడిషన్ కరీంనగర్ మారథాన్--2026 ఆదివారం ఘనంగా జరిగింది.

5,500 మందితో పరుగుల పండుగ

అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 5 గంటల నుంచే రన్నర్ల సందడి మొదలైంది. ముందస్తుగా నమోదు చేసుకున్న 5,500 మందికి పైగా రన్నర్లు ఉత్సాహంగా మారథాన్‌లో పాల్గొన్నారు. సంగీతం, కేరింతలు, ఉత్సాహ నినాదాలతో స్టేడియం మార్మోగింది. వివిధ వయసుల వారు ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన చాటుతూ పరుగులు తీశారు.

ప్రముఖుల ఫ్లాగ్‌ఆఫ్...

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ హర్ష కోయ ముఖ్య అతిథులుగా హాజరై మారథాన్‌ను ప్రారంభించారు. తేజస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్‌రావు, ముల్కనూర్ డెయిరీ మార్కెటింగ్ ఆఫీసర్ రుద్రప్రతాప్, సిద్ధార్థ పాఠశాలల చైర్మెన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొని రన్నర్లను ఉత్సాహపరిచారు.

**డ్రగ్స్‌కు నో.. యువత ప్రతిజ్ఞ...**

మారథాన్‌లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణ పోలీసుల ప్రత్యేక విభాగమైన ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో యువత, విద్యార్థులతో మాదకద్రవ్యాల



వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. డీఎస్పీ ఉపేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థుల సందడి...

ఐవీవై, సిద్ధార్థ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో మారథాన్‌లో పాల్గొన్నారు. ప్రత్యేక డ్రెస్‌కోడ్‌తో క్రమశిక్షణగా పరుగెత్తుతూ 'ఫిట్ ఇండియా' సందేశాన్ని చాటారు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు, దంపతులు, స్నేహితులు కూడా కలిసి పరుగెత్తడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రెండు నెలల శ్రమకు ఫలితం...

మారథాన్ విజయవంతానికి కేఆర్ సీఏ
కి చెందిన సుమారు 50 మంది సభ్యులు రెండు నెలలుగా అహర్నిశలు శ్రమించారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, స్పాన్సర్లు, భాగస్వామ్య సంస్థలు, నగరవాసుల సహకారానికి కే ఆర్ సీ ఏ
అధ్యక్షుడు పసుల మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## వెలిచాలలో సాంప్రదాయ క్రీడా పోటీలు



**రామడుగు డీసీ**

మండలంలోని వెలిచాల గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సాంప్రదాయ క్రీడా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీతో పాటు సిర్రగోనె, కుర్చీ పరుగు, గోటీలు తదితర సాంప్రదాయ పోటీల్లో యువతి, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల నర్సింగరావు, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.